ప్రజాశక్తి
బుధవారం 2 అక్టోబరు 2024

దసరా సెలవులు కచ్చితంగా పాటించాలి

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈనెల మూడు నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సెలవులపై ఇప్పటికే తమకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో దసరా సంబరాల పేరుతో పరోక్షంగా తరగతుల నిర్వహణ, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ప్రయత్నిస్తే బాలల హక్కుల ఉల్లంఘనలుగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఇటువంటి పాఠశాలలపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలతో పాటు ఆయా పాఠశాలల గుర్తింపు రద్దుకు సిఫార్సులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటువంటి పాఠశాలల వివరాలు apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రిటైల్ మద్యం వ్యాపారం ఆరంభం

- 158 దుకాణాలకు దరఖాస్తులకు ఆహ్వానం
- రూ.55 లక్షల శ్లాబ్‌లో 18 దుకాణాలు
- రూ.65 లక్షల శ్లాబ్‌లో 140 దుకాణాలు
- 11న అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ
- 12న కొత్త షాపులు ప్రారంభం
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం విధానానికి అనుగుణంగా రిటైల్ వ్యాపార దుకాణాలకు లైసెన్స్ మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పాలనా వ్యవహారాలు చూసిన ఎక్సైజ్‌శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్‌లో 30 మండలాల పరిధిలోనే దుకాణాలకు లైసెన్సులను మంజూరు చేయనుంది. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న 12 ఎక్సైజ్ స్టేషన్లు (ఆఫ్‌లైన్) విధానాల్లో తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



నూతన మద్య విధానం విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు వెలువరించిన నేపథ్యంలో జిల్లాలో అధికారులు గెజిట్ నోటిఫికేషన్ వెలువరించారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో మొత్తం 158 దుకాణాలకు లైసెన్స్‌లు ఇవ్వనున్నట్లు అందులో పొందుపరిచారు. మద్యం షాపుల కేటాయింపు కోసం ప్రభుత్వం నాలుగు శ్లాబ్‌లుగా నిర్ణయించింది. పది వేల జనాభా లోపు రూ.55 లక్షలు, పది వేలు దాటి 50వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షల మేర లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 50 వేలు దాటి ఐదు లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.75 లక్షల రుసుము, ఐదు లక్షల జనాభా దాటితే రూ.85 లక్షల ఫీజు చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. నాలుగు శ్లాబుల్లో జిల్లాలో మొదటి రెండు కేటగిరీలు మాత్రమే ఉన్నాయి.

రూ.55 లక్షల శ్లాబ్‌లో 18 దుకాణాలు ఉండగా, రూ.65 లక్షల కేటగిరీలో 140 దుకాణాలు ఉన్నాయి. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 14 షాపులు ఉన్నాయి. ఇవన్నీ రూ.65 లక్షల శ్లాబ్ కేటగిరీలో ఉన్నాయి. పలాస మున్సిపాలిటీలో రూ.65 లక్షలతో షాపులను కేటాయించనుంది. మండల కేంద్రాల విషయానికి వస్తే రణస్థలంలో రూ.65 లక్షల శ్లాబ్ కింద పది దుకాణాలను కేటాయించారు. కంచిలిలో రూ.65 లక్షల శ్లాబ్‌తో ఒక షాపునకు మాత్రమే లైసెన్స్ మంజూరు చేయనున్నారు.

ఇతర నిబంధనలు ఇవే...

ఒక దుకాణానికి ఒకరు కంటే ఎక్కువ మంది దరఖాస్తులు చేస్తే అర్హులైన వారిని గుర్తించి లాటరీ పద్ధతిన లైసెన్స్ కేటాయించనున్నారు. దరఖాస్తుదారుడు మాత్రమే అప్లికేషన్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలైనా పొందవచ్చని, ఎటువంటి ఆంక్షల్లేవని గెజిట్‌లో పేర్కొన్నారు. దుకాణం దక్కించుకున్న రోజు గానీ బ్యాంకు పనిచేసే రోజున బ్యాంకు గ్యారంటీ సమర్పించకుంటే ఆ తర్వాత ఉన్న దరఖాస్తుదారునికి షాపును కేటాయిస్తారు. ఆ దుకాణానికి ఎక్కువ దరఖాస్తులు వస్తే మళ్లీ లాటరీ తీసి కేటాయించనున్నారు.

11న అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ

మద్యం దుకాణాలకు ఈనెల తొమ్మిదో తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 11న ఉదయం ఎనిమిది గంటలకు శ్రీకాకుళం నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో లాటరీ నిర్వహించనున్నారు. అందులో విజేతలైన వారికి దుకాణాలను కేటాయించనున్నారు. ఆ మరుసటి రోజు నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం కానున్నాయి. దుకాణాలు దక్కించుకున్నవారు మున్సిపల్, మండల ప్రాంతాల్లో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు.

దరఖాస్తుల స్వీకరణ ఇలా...

జిల్లాలో మంగళవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా, ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే వారు https//hpsproject.com వెబ్‌సైట్‌లో పంపాలి. దరఖాస్తులను నేరుగా ఇవ్వాలనుకునే వారు ఆయా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో అందజేయవచ్చు. పూర్తి వివరాలకు ఎచ్చెర్ల కింతలిమిల్లు వద్ద ఉన్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూపరింటెండెంట్ తిరుపతి నాయుడు తెలిపారు.

వీరు అనర్హులు

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసే వారు 21 లోపు వయసు ఉండకూడదు. పదేళ్ల కాలంలో ఏ ఒక్క నేరంలోనూ శిక్ష అనుభవించి ఉండకూడదు. శిక్ష పడినట్లు తేలితే ఏ సమయంలోనైనా లైసెన్స్ రద్దు చేయనున్నారు. ఎక్సైజ్‌శాఖ జాబితాలో డిఫాల్టర్లుగా ఉంటే అటువంటి వారిని అనర్హులుగా పరిగణించనున్నారు.

నిరాహార దీక్షా శిబిరంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర
- అఖిలపక్ష కార్మిక సంఘాల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రుల ఆత్మబలిదానాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేసి పరిరక్షించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద మంగళవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ప్రారంభించారు. ప్రజానాట్యమండలి కళాకారులు చింతాడ రామచంద్రరావు, ఎస్.శ్రీనివాస్ గీతాలను ఆలపిస్తూ పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి రోజురోజుకీ దిగజారిందన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండు మూతపడగా విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల టన్నులు ఉండగా, గతేడాది 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే నాణ్యమైన విశాఖ స్టీల్‌కు డిమాండ్ ఉన్నా కావాలనే ఉత్పత్తి తగ్గించి కేంద్ర ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నా, ఒక్క విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవన్నారు. సొంత గనులున్నా ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలు ఇనుప ఖనిజం తవ్వి తీసుకోవడానికి టన్నుకు రూ.500 మాత్రమే ఖర్చవుతుందని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇనుప ఖనిజం టన్ను రూ.5,940 పెట్టి మార్కెట్‌లో కొనాల్సి వస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ దేశంలోనే అత్యుత్తమైందని కొనియాడారని గుర్తుచేశారు. 45 రోజుల్లో విశాఖ ఉక్కును రక్షించేందుకు ప్రణాళికతో ప్రధాని మోడీని ఒప్పించి పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించారని, ప్లాంట్ పరిరక్షణకు చర్యలు చేపట్టకపోగా నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి కేవలం రూ.ఐదు వేల కోట్లు మాత్రమేనని... ఇప్పటివరకు పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు పైగా విశాఖ ఉక్కు చెల్లించిందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టి ప్రత్యేక హోదా లేకుండా చేసి, ఉన్న ఏకైక భారీ పరిశ్రమను అదానీ, అంబానీ, పోస్కో వంటి స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టాలనే కుట్ర ఏం దేశభక్తో అర్థం కావడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిందని, టిడిపి ప్రభుత్వ మద్దతుతోనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నడుస్తున్నా ఎందుకు కాపాడలేకపోతుందని ప్రశ్నించారు. టిడిపి, జనసేన బిజెపిపై ఒత్తిడి తెచ్చి ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో కవులు, రచయితలు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు కలసి రావాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, చిక్కాల గోవిందరావు, వైఎస్ఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు, ఎస్.వెంకటరావు, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు కూన వెంకటరావు, సిఐటియు జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి, ఎ.మహాలక్ష్మి, ఎస్.వి.రమణ, ఎం.ఆదినారాయణ మూర్తి, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పనలో ప్రజలు భాగస్వాములై తమ అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రంలోనే జిల్లా తొలి స్థానంలో నిలిచిందన్నారు. ఇంకా సమయం ఉన్నందున స్వర్ణాంధ్ర సాధనకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాన్నారు. రెవెన్యూ, ఫ్రీహోల్డ్ సర్వే, కోర్టు కేసులు, రీ ఓపెన్ గ్రీవెన్స్, ఓటర్ల జాబితా రూపకల్పన, స్వచ్ఛతా హీ సేవ, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులు, వంద రోజుల ప్రగతి తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధికి అవసరమైన వనరులున్నాయని, వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మీకోసంలో వచ్చే ఫిర్యాదులను సరైన కారణాలు లేకుండా తిరస్కరించవద్దని చెప్పారు. రీ ఓపెన్ చేసిన అర్జీలను నిశితంగా పరిశీలించి అవసరమైన సందర్భంలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన హౌస్ హోల్డ్ తనిఖీలను ఎన్నికల సంఘం నిర్ణయించిన షెడ్యూల్ మేరకు పూర్తి చేయాలన్నారు. మన ఇళ్లు-మన గౌరవం హౌసింగ్ కార్యక్రమంలో ప్రతి వారం కచ్చితమైన పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఆర్‌డిఒలు సుదర్శనదొర, భరత్ నాయక్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాల బంద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో అన్ని మాంసం, చేపల విక్రయ దుకాణాలు, జంతు వధశాలలను బుధవారం పూర్తిస్థాయిలో మూసివేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు ఆదేశించారు. ఈమేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేస్తే కఠిన చర్యలతో పాటు అపరాధరుసుం వసూలు తప్పదని హెచ్చరించారు.

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

పట్టువస్త్రాలను సమర్పిస్తున్న రామ్మోహన్‌నాయుడు

కొత్తమ్మతల్లిని దర్శించుకుంటున్న మంత్రులు, కలెక్టర్, ఎస్‌పి తదితరులు

మూడు రోజుల పాటు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ మేనేజర్ వాకచర్ల రాధాకృష్ణ, పురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతంశర్మ, అరసవల్లి ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అంబికా దర్బారు సంస్థ ఏర్పాటు చేసిన ఐదడుగుల అగరబత్తిని ప్రారంభించారు. కొత్తమ్మతల్లి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మంత్రులు నడుచుకుంటూ మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన దుర్గా విగ్రహాన్ని దర్శనం చేసుకున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గల కోటదుర్గమ్మ తల్లినీ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు బగ్గు లక్ష్మణరావు, గొండు శంకర్ పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచీ యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఉన్న అమ్మవారి జంగిడిని అసాదీల కుటుంబీకుల పెద్ద తలపై పెట్టుకొని తల్లికి నిలయమైన రెడ్డిక వీధికి చెందిన కమ్మకట్టు చిన్నఅప్పలనాయుడు ఇంటి వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జంగిడిని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రెడ్డిక వీధి నుంచి కలశాలతో ఊరేగింపుగా కొత్తమ్మతల్లి ఆలయానికి తీసుకొస్తారు. కొత్తమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డు పక్కన సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన అమ్మవారి సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంది. కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి వ్యాపారవేత్త అంధవరపు సంతోష్ కుమార్, బోయిన గోవిందరాజులు మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు రూ.లక్ష విరాళంగా రూ.లక్ష చెక్కును అందజేశారు.

దొరికిన దేవాలయ చోరీల దొంగలు

- పోలీసులకు పట్టుబడిన ముఠా
- రూ.91.38 లక్షల సొత్తు రికవరీ
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.91.38 లక్షల సొత్తును రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో 2021 నుంచి వరుసగా చోటుచేసుకుంటున్న ఆలయాల నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి ఎనిమిది బృందాలతో రంగంలోకి దిగారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కొన్ని కేసులను చేధించారు. దొంగతనాల్లో మొత్తం తొమ్మిది మంది భాగస్వామ్యమైనట్లు పోలీసులు నిర్ధారించారు. వీరిలో నలుగురు కోనసీమ జిల్లాలో అరెస్టయ్యారు. వీరు సీతంపేట, ఎల్.ఎన్.పేట, హిరమండలం, పార్వతీపురం మన్యం, తెలంగాణలోని మెదక్‌కు చెందిన వారుగా గుర్తించారు. వీరిలో ఆరుగురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురిని అదుపులో తీసుకోనున్నారు. జిల్లాలో 39 నేరాలు, విశాఖపట్నం, కోనసీమ జిల్లాల్లో చెరొకటి, తెలంగాణ రాష్ట్రం మెదక్‌లో రెండు నేరాలు కలిపి మొత్తం 43 దొంగతనం కేసుల్లో వీరు ఉన్నట్లు తేల్చారు. జిల్లావ్యాప్తంగా 32 ఆలయ నేరాలు, 3 రైస్‌మిల్లుల నేరాలు, నాలుగు గృహ నేరాలతో మొత్తం 39 నేరాలకు పాల్పడ్డారు. పట్టుబడిన వారి నుంచి 692 గ్రాముల బంగారు ఆభరణాలు, 52 కేజీల 880 గ్రాముల వెండి ఆభరణాలు (వస్తువులు), రూ.3,38,570 నగదు, నాలుగు మోటర్ బైక్‌లు, రెండు కట్టర్స్, గునపాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.91.38 లక్షలుగా నిర్ధారించారు. దొంగిలించిన సొమ్ముతో కొనుగోలు చేసిన కారును అమలాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేరం ఇలా చేశారు...

సిసి కెమెరాలు లేని ఆలయాలే లక్ష్యంగా వీరు దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్‌పి వివరించారు. సిసి కెమెరాలు ఉంటే వాటిని కట్టర్స్, ఇతర పరికరాలను ఉపయోగించి నేరాలు చేస్తుంటారని తెలిపారు. సిసి కెమెరాల డివిఆర్‌లను ఎత్తుకుపోయి నీటిలో పడేసేవారని చెప్పారు. జన సంచారం లేని ఆలయాల వద్ద రెక్కీ నిర్వహించి నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. పొందూరు మండలం నందివాడలో దుర్గామాత, ఎచ్చెర్ల మండలంలోని శ్రీచక్ర ఆలయం, కోటబొమ్మాళి మండలంలో సాయిబాబా, శివాలయం, గారలో వెంకటేశ్వర, సాయిబాబా ఆలయాలు, శ్రీకాకుళం నగరంలోని అమ్మవారి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో వీరు దొంగతనాలు చేశారని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి హెచ్చరించారు. ఆలయాలు, వ్యాపార, గృహ సముదాయాల వద్ద తప్పకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆలయాల్లోని ఆభరణాలు, హుండీలో నగదును భద్రపరుచుకోవాలని, అవసరమైతే భద్రత కోసం గార్డులను నియమించుకోవాలని సూచించారు.

పోలీసులకు అభినందన

దొంగతనం కేసులను చేధించడంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో, భారీస్థాయిలో కేసు ప్రాపర్టీ స్వాధీనం చేసుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐలు అవతారం, జె.శ్రీనివాసరావు, ఎస్ఐలు సందీప్ కుమార్, లక్ష్మణరావు, నిహార్, వెంకటరావుతో పాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పేదల సంక్షేమమే లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

పింఛను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నరసాపురంలో మంగళ వారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ అందజేస్తామని తెలిపారు. జగన్ తన పాలనలో రూ.12 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని ధ్వజమెత్తారు. తన పాలనలో బటన్ నొక్కి ప్రజలకు రూ.మూడు లక్షల కోట్ల సంక్షేమ పథకాలు ఇచ్చానని చెప్తున్న జగన్, మిగతా రూ.తొమ్మిది లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. గత ఐదేళ్ళుగా పూర్తిగా అభివృద్ధి కుంటుపడిపోయిందని విమర్శించారు. కనీసం రోడ్లు, కాలువలు, డ్రైనేజీల మరమ్మతులకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి పంచాయతీని అభివృద్ధిపథంలో నిలబెడతామన్నారు. టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రూ.వంద కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీటి కుళాయి వేసి 24 గంటలూ మంచినీటి సరఫరా చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఒ ప్రేమలీల, ఎంపిటిసి ఎం.పద్మ, తోటాడ సర్పంచ్ యర్నాగుల సునీత, టిడిపి నాయకులు ఎం.రామచంద్రరావు, ఆళ్ల బైరాగి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో మెరుగైన వైద్యం

- అనారోగ్య సమస్యలుంటే సంప్రదించాలి
- పది రోజుల పాటు వృద్ధులకు వైద్య పరీక్షలు
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, అనారోగ్య సమస్యలు ఉంటే అక్కడకు వెళ్లి వైద్యంతో పాటు అవసరమైన మందులు పొందాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మథర్ థెరిసా ఆశ్రమంలో వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలను డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా పది రోజుల పాటు వృద్ధులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించే ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పళ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం నెలకోసారి మానసిక వైద్యులను, రెండుసార్లు సాధారణ తనిఖీలకు సమీప పిహెచ్ వైద్య సిబ్బందిని పంపిస్తామన్నారు. మధుమేహం, రక్తపోటుకు సంబంధించిన మందులు పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందింపచేయడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు మండల, మున్సిపాలిటీ కి చెందిన 17 ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రథమ విజేతలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దూసిపేట విద్యార్థులు సిహెచ్.సతీష్‌కుమార్, ఎం.లవకుమార్, టి.సూర్య ప్రకాష్‌లు నిలిచారు. ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ హైస్కూల్ అక్కులపేట, కొర్లకోట హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. పట్టణ స్థాయిలో ప్రథమ విజేతలుగా ఎస్‌విఎస్ విద్యార్థులుకొనపల సాయిసిద్ధు, సిగిలిపల్లి రిషినారాయణ, రోణంకి లేష్మాశ్రీ నిలిచారు. ద్వితీయ స్థానంలో అదే పాఠశాలకు చెందిన బి.భవానీప్రసాద్, పి.నరేంద్రకుమార్ పి.జ్యోత్స్నలు నిలిచారు. తృతీయ స్థానంలో మున్సిపల్ హైస్కూల్ లక్ష్మీనగర్ విద్యార్థులు నిలిచారు. విజేతలకు ఎంఇఒ జి.రాజేంద్రప్రసాద్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మెండ శ్యామలరావు, టి.వి.టి.భాస్కరరావు, హెచ్.వి.సత్యనారాయణ, కర్నేన జన్దానరావు, బెండి సూర్యనారాయణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.అప్పలరాముడు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : చెకుముకి ప్రతిభా పరీక్షలు ప్రథమస్థానంలో బోరుభద్ర, ద్వితీయ స్థానంలో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిలిచారు. జన విజ్ఞాన వేదిక కన్వీనర్లు ఎం.అసిరినాయుడు, జిల్లా కన్వీనర్ బాడాన రాజు, ఆధ్వర్యాన హెచ్‌ఎం బరాటం కామరాజు అధ్యక్షతన పరీక్షలు నిర్వహించారు. విజేతలకు ఎంఇఒలు జె.చిన్నవాడు, డి.అర్జునుడు బహుమతులను అందజేశారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు, వెంకటరెడ్డి, జె.జోగారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : మానవుని ప్రగతికి సైన్స్ మూలాధారమని, సైన్స్ అధ్యయనం చేయటంతో పాటు నిత్యజీవితంలో ఆచరిస్తూ మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని రేడియాలజిస్టు డాక్టర్ సిహెచ్.అనిల్‌కుమార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. 19 పాఠశాలల నుంచి 34 టీమ్‌లు, 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టి.రూపవతి బహుమతులను అందజేశారు. కంబకాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.సురేష్ కుమార్, వై.భరత్‌సాయి, బి.భువన, శృతి, నరసన్నపేట మహాత్మా జ్యోతిబా పూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బృందం ద్వితీయ బహుమతి, ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ప్రయివేట్ పాఠశాలల నుంచి విజ్ఞాన్ విద్యా నికేతన్ విద్యార్థులు ఎం.శరీష్మా, వి.తేజ, ఎం.జాహ్నవి ప్రథమ బహుమతి గెలుచుకోగా, సెయింట్ క్లారెట్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతిని, శ్రీజ్ఞాన జ్యోతి విద్యాలయం విద్యార్థులు తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. చెకుముకి జిల్లా కో-కన్వీనర్ ఎస్.సాయిశ్రీనివాసశర్మ, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు డి.లక్ష్మణరావు, రాజేంద్రనాయుడు పరీక్ష నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్‌బాబు చెకుముకి పరీక్ష నిర్వహించిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందచేశారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ విజేతలు అక్టోబరు 27న జరిగే జిల్లా స్థాయి పరీక్షకు సన్నద్ధం కావాలని అన్నారు.

నందిగాం : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో లఖిదాసుపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలక జశ్వంత్‌సాయి, నీలాపు బారతి, కుత్తుం తనీష్‌లు ప్రతిభ కనబరిచారు. కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు చిలుక కృష్ణారావు, ఉపాధ్యాయులు రంకిడి రామారావు, తులసీప్రసాద్, బెందాళం రత్నం, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు, నక్క గోవిందరావు, దుంపల సంధ్యారాణిలు అభినందించారు.

టెక్కలి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ప్రభుత్వ వైద్యులు లక్ష్మణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్.శోబారాణి, పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, డొంకాన పాపారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. మండలస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, టెక్కలి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతులు సాధించారు.

ప్రయివేటు పాఠశాలల విభాగంలో రవీంద్ర భారతికి చెందిన విద్యార్థులు ఉదయ్, సృష్టి రంజన్, జ్యోతిశ్రీలు ప్రథమస్థానం కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ ఎం.పద్మజ తెలిపారు. వీరికి డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

మందస : మండలంలోని హరిపురం, అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో హరిపురం ప్రభుత్వ పాఠశాల ప్లస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కంచరాన జ్యోషిత, అందాల రస్మిత, గున్న ప్రణీతలు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సిద్ధార్థ కుమార్ గౌడో, పి.షణ్ముఖ్, పి.ధనుష్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అనంతరం విజేతలకు చెకుముకి కో-ఆర్డినేటర్ ఎస్.సోమనాథ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.సీతమ్మ, చెకుముకి మండలస్థాయి ప్రతిభా పరీక్షా నిర్వాహకులు ఎస్.కోదండరాం, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, మజ్జి వైకుంఠరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఈ నెల 28న శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షకు మండలంలోని లఖందిడ్డి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఒకరు, కెజిబివి ఒకరు, నలంద ప్రయివేటు పాఠశాలను ఒకరు ఎంపికైనట్లు జివివి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సంజీవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావులు తెలిపారు. స్థానిక బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఆర్.కె.రవికుమార్, పి.అరుణ కుమారి, కె.సోమశేఖర్, పి.ధనుంజయరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

రణస్థలం రూరల్: సమాజంలో శాస్త్రసాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మండలంలోని కోష్టలోని నారాయణ స్కూల్ డైరెక్టర్ కెల్ల మంజుభార్గవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నారాయణ స్కూల్ విద్యార్థులు నిలిచారని అన్నారు. విద్యార్థులు ఎస్.రాజ్‌కుమార్, ఎం.పల్లవి, ఎస్.మనోహర్ ప్రతిభ కనబర్చారని తెలిపారు. వీరికి కె.గోపి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరికి డైరెక్టర్‌తో పాటు కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ గౌరినాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని మూడు కేంద్రాల్లో చెకుముకి పోటీ పరీక్షలను నిర్వహించారు. శాస్త్ర సాంకేతిక రంగంపై అవగాహన కల్పించడానికి వీలుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి పి.కూర్మారావు తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, అరసవల్లి ఎంసిహెచ్ స్కూల్ విద్యార్థులకు నగర విభాగంలోను, శాస్త్రులపేట, అంపోలు బిసి సంక్షేమ గురుకులాల్లో, ప్రయివేటు స్కూళ్ల నుంచి ఆక్సఫర్డు, న్యూ సెంట్రల్ స్కూల్ పాఠశాలలను ఎంపిక చేసి వాటి నుంచి ఎంపికైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- పొందూరు

దుర్గారావు (ఫైల్)

మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేటకు చెందిన కుమరావు దుర్గారావు (26) వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రెండు రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగి అస్వస్తతకు గురయ్యాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నౌపడ రోడ్డు రావివలస సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో వాహనదారుడు గాయపడ్డాడు. తేలినీలాపురానికి చెందిన వీరఘట్టపు దుశ్యంత్ కుమార్ ద్విచక్ర వాహనంపై టెక్కలి వస్తున్నాడు. రావివలస సమీపంలో వెనక నుంచి ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఎ.వినోద్‌కుమార్ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులను తరలించేందుకు సిద్ధమవుతున్న తిలక్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్ : నందిగాం మండలం పెంటూరుకు చెందిన ప్రగడ బాలకృష్ణ, సనపల గోవింద్‌లు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. గొల్లూరు జాతీయ రహదారి దగ్గర వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అటు వైపు వెళ్తున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ తన కారులో క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. దగ్గరుండి వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. తిలక్ చొరవను తెలుసుకున్న పలువురు హర్షం వ్యక్త చేస్తున్నారు.

రచయిత 'చీకటి' మృతి

కామేశ్వరరావు (ఫైల్)

పలాస : ప్రముఖ రచయత, కళాకారులు, విశ్రాంత అధ్యాపకుడు చీకటి కామేశ్వరరావు (82) మంగళవారం మృతి చెందారు. కాశీబుగ్గ తిలక్ నగర్‌లో నివాసం ఉంటున్న ఆయన అనేక కథలు, గేయాలు, కవితలు రాశారు. ఈయన రచించిన అనేక పుస్తకాలు ప్రాచుర్యం పొందాయి. అనేక నాటకాలు, నాటికలు వేశారు. ఎంఎ తెలుగ సాహిత్యం చదివిన కామేశ్వరరావు అంతరంగంలో అక్షరం, కన్నీటిలిపి, ఎగిరే పావురాలు, విత్తులోంచి వియత్తలంలోకి వంటి కవితా పుస్తకాలు రాశారు. నానీలతో పాటు జీవకారుణ్యం, గోరంతదీపాలు, నడిసముద్రంలో నావ, దివ్యసుగుణబాల, భావతరంగాలు వంటి ఆముద్రిత రచనలు అనేకంగా ఉన్నాయి. వజ్రపుకొత్తూరు వండలం బైపల్లికి చెందిన ఈయన కాశీబుగ్గలో స్థిరపడ్డారు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. కామేశ్వరరావు మృతిపై కవులు, రచయతలు బద్రి కూర్మారావు, వంకల రాజారావు. టి.కృష్ణమూర్తి, కుమార్నాయక్ సంతాపం తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

రణస్థలం రూరల్: మండలంలోని నదుకుడిటిపాలెం తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నాని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మెగా రక్తదాన శిబిరంలో భాగస్వామ్యలమై ప్రాణదాతలుగా నిలుద్దామని పిలుపునిచ్చారు.

నిరసన తెలుపుతున్న సిబ్బంది

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన

టెక్కలి రూరల్ : టెక్కలిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నామని, తాజాగా నూతన మద్యం పాలసీ విధానంతో తమకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నూతన మద్యం పాలసీ విధానంతో ప్రభుత్వ మద్యం షాపులు గడువు పూర్తికావడంతో తాము ఉద్యోగాలను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

చెక్కును అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వరద బాధితులకు విరాళం

ఇచ్ఛాపురం: విజయవాడ వరద బాధితుల సహాయర్థం నియోజకవర్గ ప్రయివేట్ స్కూళ్ల అసోసియేషన్ రూ.1.04 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎపి ప్రయివేటు స్కూళ్ల అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తిరెడ్డి, నియోజకవర్గ ప్రెసిడెంట్ తులసిదాస్, సెక్రటరీ కోట రామారావు, మండలం ప్రెసిడెంట్ పి.చిరంజీవి, సెక్రటరీ మార్కండయులు, సోంపేట మండలం ప్రెసిడెంట్ కె.వి.రమేష్‌బాబు, వల్లభరావు, ప్రసాదరావు, బాలు, కవిటి మండల ప్రెసిడెంట్ బి.వి.ప్రసాదరావు, బి.రమేష్, కంచిలి మండలం ప్రెసిడెంట్ వాసుదేవరావు, జోహార్‌ఖాన్, జి.కృష్ణమూర్తి, జి.వెంకట రమణ, ఢిల్లేష్ పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కమ్యూనిస్టు ఉద్యమ సారధి సీతారాం ఏచూరి గొప్ప దార్శినికుడని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాలాకి ప్రసాదరావు అన్నారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో మండల కళాసీ సంఘం అధ్యక్షులు దారపు దామోదర్ అధ్యక్షతన మంగళశారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజనతో నష్టపోయిన ఆంధ్రాకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని అప్పుడు రాజ్యసభలో గట్టిగా తన వాని వినిపించారని గుర్తు చేశారు. ఢిల్లీలోని జెఎన్‌టియులో చేరిన తర్వాత ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పరిపూర్ణమైన నాయకత్వం వహించడం వల్లే ఏచూరి ఈ స్థాయికి చేరుకున్నారని అన్నారు. విద్యార్థులు, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మతతత్వ శక్తులు, పెట్టుబడిదారుల బంధాన్ని విడగొట్టేందుకు ఐక్యంగా పనిచేయడమే ఏచూరికిచ్చే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ఉమా, జి.ప్రసాద్, రమేష్, శంకర్, చంద్రశేఖర్, కళాసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

బూర్జ : అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. మండలంలోని కాఖండ్యాం ఇసుక ర్యాంపును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతుల మేరకే ఇసుకను రవాణా చేయాలని సూచించారు. ఫిర్యాదులకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇసుక ర్యాంపు రికార్డులను పరిశీలించారు ఈయనతో పాటు తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ ఉన్నారు.

వృద్ధులపై నిరాదరణ తగదు

శ్రీకాకుళం అర్బన్ : ఎంతో శ్రమ పడి జీవితాంతం పిల్లల అభివృద్ధికి తపన పడ్డ వారు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవడం ఆందోళనకరమని, ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. నగరంలోని తిలక్ నగర్‌లో ఉన్న ఖ్యాతి వృద్ధాశ్రమాన్ని మంగళవారం సందర్శించారు. వృద్ధులపై ఆదరణ పెంచేందుకు వృద్ధాశ్రమాల నిర్వహకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వృద్ధాప్యంలోని వారిపై ఆదరణ పెరగాలన్నారు. వారి అనుభవాలను, కుటుంబంలో ఎదురయ్యే అనేక సమస్యలకు వారు చూపే మార్గాలు అనుసరణీయమన్నారు. నేటి పరిస్థితులకు పెద్దల మాట పెడ చెవిన పెట్టి కుటుంబ వ్యవస్థను కోల్పోతున్నారన్నారు. అనంతరం వృద్ధులకు పళ్లు పంపిణీ చేశారు. ఆయనతో పాటు న్యాయవాది ఇందిరప్రసాద్ ఉన్నారు.

అగ్నిమాపకశాఖ ఉద్యోగుల సంఘం

జిల్లా అధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్నిమాపకశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా కె.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని పాతబస్టాండ్ సమీపంలోని జిల్లా అగ్నిమాపక కేంద్రంలో జిల్లా అగ్నిమాపక అధికారి కె.మోహనరావు అధ్యక్షతన మంగళవారం ఎపి డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లాలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పి.గోవిందరావు, బాలకృష్ణ వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా పాలకొండ ఫైర్‌మేన్ కె.సత్యనారాయణ, సెక్రటరీగా శ్రీకాకుళం ఫైర్‌మెన్ టి.జగన్నాథం, జాయింట్ సెక్రటరీగా ఇచ్ఛాపురం ఎల్ఎఫ్ ఎస్.నీలాచలం, ట్రెజరర్‌గా రాజాం ఎఫ్ఎం డి.రవికుమార్, అడ్వయిజర్‌గా కొత్తూరు ఎల్ఎఫ్ జి.రమణమూర్తిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బొడ్డేపల్లి హరినారాయణ తదితరులు పాల్గొన్నారు. వీరికి జిల్లా అగ్నిమాపక అధికారి అభినందనలు తెలిపారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

బాలికల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

పాఠశాల స్థాయి నుండే బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక కళాశాల బాలికల సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతిగృహంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధించేందుకు నిరంతరంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి వార్డెన్ శ్రీదేవికి సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది అశోక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి బి.జ్యోత్స్న

కోర్టులో స్వచ్ఛతా హీ సేవ

పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ఆధ్వర్యాన స్వేచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో నిర్వహించారు. కోర్టు ఆవరణంలోని పరిసరాల్లో చెత్తా చెదారాలను, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. దీనిని పంచాయతీ సిబ్బంది ద్వారా బయటకు తరలించారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ, న్యాయవాదులు కె.రమణమూర్తి, కిరణ్‌కుమార్, బ్రహ్మాజీ, అశోక్, రామ్మోహనరావు, మేజర్ పంచాయతీ ఇఒ మోహన్‌బాబు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : అభినందిస్తున్న వేణుగోపాల్

విద్యార్థులకు అభినందనలు

శ్రీకాకుళం : ఇటీవల గాయత్రి కళాశాలలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవంలో నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ విద్యార్థులు వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి తమ ప్రతిభను చాటరని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు విజేతలకు మంగళవారం అభినందనలు తెలిపారు. తమ కళాశాలకు చెందిన మహమ్మద్ యాస్మిన్ నూర్ భాష డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని హింది కవిత పోటీలో రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు తెలిపారు. కవితల విభాగంలో బి.త్రివెన్ ద్వితీయ స్థానం, కుమారి, ఎం.ఊర్మిళ జానపద నృత్యంలో తృతీయ స్థానం, జానపద సంగీతంలో కుమారి బి.రూపబతి తృతీయ స్థానం, ఉపన్యాసంలో కుమారి జె.లోలాక్షి తృతయస్థానం సాధించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు టి.పద్మావతి పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీలో సెట్‌శ్రీ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో తమ కళాశాలకు చెందిన పి.ఉదయ్‌కిరణ్ (పెయింటింగ్స్)లో ద్వితీయస్థానం, సుస్మిత జానపద నృత్యంలో పాల్గొని ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించుకున్నారని తెలిపారు.

'అగ్నివీర్'కు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన 12 మంది విద్యార్థులు అగ్నివీర్ సైనికులుగా ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిరిపురం భీమేశ్వరరావు మంగళవారం తెలిపారు. కళాశాలలో గతేడాది చదివిన విద్యార్థులు కోట సాయికృష్ణ, గిన్ని నాగిరెడ్డి, లోపింటి దిలీప్, బొమ్మాళి చేతన్, బొమ్మాళి సతీష్, జీరు ఈశ్వరరావు, సీరపు మోహనరావు, నీలాపు సాయిలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరితోపాటు 2021-22లో చదివిన మరో నలుగురు విద్యార్థులు ఇటీవలే అగ్నివీర్ నియామకాల్లో ఎంపికయ్యారని అన్నారు. ఈ మేరకు కళాశాలకు వచ్చిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది పేద విద్యార్థులు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. దేశ సేవలో, రక్షణలో తమ వంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని విద్యార్థులకు సూచించారు. ఎంపికైన అగ్నివీర్లకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అగ్నివీర్‌కు ఎంపికైన పూర్వ విద్యార్థులు

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళలు

గ్యాస్ పరిశీలన పేరిట వసూళ్లు

పొందూరు: పొందూరు పట్టణంలో ఇండేన్ గ్యాస్ సేఫ్టీ పరిశీలన అంటూ ఇంటింటా తిరుగుతూ ఎటువంటి గుర్తింపు కార్డు లేని నలుగురు డబ్బులు వసూలు చేస్తున్నారని కాలేజీ రోడ్డు వీధి వాసులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి వచ్చి గ్యాస్ సేఫ్టీ పరిశీలించేందుకు కంపెనీ తమను పంపించిందని చెప్పి సిలెండర్, పైపు, రెగ్యులేటర్‌ను పరిశీలించారు. రబ్బరు పాడైపోతే రూ.150లు చెల్లించి కొత్తది తీసుకోవాలని చెప్పడంతో పాటు ఇకెవైసి చేయాలని చెప్పి ఇలా మొత్తం రూ.230లు చొప్పున వసూలు చేశారని అన్నారు. దీనిపై అనుమానం వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంబందిత ఏజెన్సీ వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. దీనిపై తాము గ్యాస్ సేఫ్టీ పరిశీలనకు పంపించామని, కానీ, ఇకెవైసి చేసేందుకు డబ్బులు తీసుకోవాలని తాము చెప్పలేదని తెలిపారు. ఈ విధంగా ఎవరి వద్ద అదనంగా వసూలు చేశారో వారికి తిరిగి డబ్బులు ఇప్పిస్తామని ఏజెన్సీ ప్రతినిధులు పోలీసులకు తెలియజేయడంతో వివాదం సద్దుమణిగింది.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అధికార పార్టీ నాయకులు కనుసన్నల్లోనే ఇసుక మాఫియాకి వరంలా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక అందజేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. ప్రస్తుతం గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం వంశధార నదీతీరంలోని భూగర్భజలాలు అడుగంటేలా ఇసుకను దోపిడీ చేస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక, ఇసుక అందుబాటులో లేక వలస బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పోలీసులు ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నెలకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బందాళం అశోక్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల ఆవస్యకత గురించి వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

సన్మానిస్తున్న నాయకులు

మార్క్‌ఫెడ్ సభ్యునికి సన్మానం

ప్రజాశక్తి- బూర్జ

మార్క్‌ఫెడ్ రాష్ట్ర సభ్యులు ఆనెపు రామకృష్ణం నాయుడును ఎపి రైతు సంఘం, తూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా గౌరవాధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వావిలపల్లి రమణమూర్తి, తూర్పు కాపు సంక్షేమ సంఘం పాలకొండ అధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, బి.సి. నాయుడు, జడ్డు బాలరాజు, యందవ రాధాకృష్ణ పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

మూడు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పాల కేంద్రం వెనుక భాగంలో ఉన్న కొత్తపల్లి ఆలయంలో ధర్మకర్త డబ్బింగ్ రాజేశ్వరి ఆధ్వర్యాన మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

రెచ్చిపోయిన చైన్ స్నాచర్స్

చైన్ స్నాచర్స్ రెచ్చిపోయారు. పలాసలోని అన్నపూర్ణ థియేటర్ రోడ్డులో సంతోషి, సోంపేట మండలం కొర్లాం హైవేలో పుణ్యవతి, వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం మెళియాపుట్టికి చెందిన సరోజనమ్మ మెడల్లోని గుర్తు తెలియని వ్యక్తులు మంగ ళవారం పుస్తెలతాడులను దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గకు చెందిన చిత్తరెడ్డి సంతోషి అనే మహిళ మెడలో ఉన్న పుస్తెలతాడును ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి అపహరించారు. బాధిత మహిళ సంతోషి అన్నపూర్ణ థియేటర్ రోడ్డులోని జీడి పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. విధులు ముగించుకొని 6.30 గంటల ప్రాంతంలో ఇంటికి చేరేందుకు కాలినడకన వస్తుంది. కెటి రోడ్డు ఎస్ఆర్ షాపింగ్ మాల్ దాటిన తరువాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగు ధరించి బైక్ వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడును దొంగిలించారు. ఆమె వెంటనే తేరుకొని తాడు కింద ఉన్న పుస్తెలను గట్టిగా పట్టుకోవడంతో అవి బాధిత మహిళ చేతిలో ఉండిపోయాయి. మిగిలిన 20 గ్రాముల బంగారు పుస్తెలు తాడును చోరీకి గురైంది. ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారంతా తమ వాహనాలపై దొంగలను అనుసరించినా జనం మధ్య తప్పించుకొని పరారీ అయ్యారు. ఇందులో ఒకరు ముఖానికి రుమాలు కట్టుకోగా, బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ పెట్టుకున్నట్లు గుర్తించారు. అనంతరం బాధిత మహిళ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిత్యం జనసంచారం ఉన్న కెటిరోడ్డులో ఇటువంటి దొంగతనం జరగడంతో మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోంపేట: మండలంలోని కొర్లాం హైవే వద్ద కలిపిల్లి పుణ్యవతి పొలం పనులు చూసుకొని మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తుంది. హైవేపై నడుకుంటూ వెళ్తుండగా... బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కొని వెళ్లిపోయారు. దీంతో ఆమె కేకలు వేసినా ప్రయోజనం లేకుండాపోయింది. వెంటనే బారువ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఎస్ఐ కె.కృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం మెళియాపుట్టికి చెందిన బొమ్మాళి సరోజనమ్మ మెడలో ఉన్న బంగారం గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఎఎస్ఐఐ జూన్నారావు చెప్పారు. ఉదయం స్వగ్రామం నుంచి పలాస మండలం గరుడిఖండికు బొమ్మాళి లక్ష్మయ్య, అతని భార్య సరోనమ్మలు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. బెండి గేటు కూడళి వద్ద గుర్తుతెలియని యువకుడు సరోనమ్మ మెడ నుంచి సుమారు తులంన్నర బరువు ఉండే బంగారం చైన్‌ను తెంపుకొని వెళ్లిపోయాడు. వెంటనే అతని కోసం చుట్టు పక్కల వారు గాలించినా అప్పటికే అగంతకుడు పరారయ్యాడు. సరోనమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు

విశాఖ ఉక్కు సంకల్పంతో ఉద్యమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ తక్షణమే ఆపాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఎదుట విద్యార్థి సంఘాల నేతృత్వాన మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాభాలతో ఉన్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలన్న బిజెపి ప్రభుత్వ ఆలోచనలు విరమించాలని డిమాండ్ చేశారు. ఉక్కు ఏర్పాటుకు 32 మంది బలిదానం చేశారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువయ్యాయన్నారు. విద్యార్థి, యువజన సంఘాల ఉద్యమానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు కూర్మారావు, శ్యామ్, కాళీ, వసంతరావు, నరేష్, కిరణ్, రవి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్ సిక్స్ అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్-సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని బొడ్డ వాసుదేవరావు, రైతాంగ నాయకులు మద్దిల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడు, మాకన్నపల్లి సచివాలయాల వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో కరువు ప్రకటించి పంటల రైతుల రుణాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, పేదలకు బియ్యం, పప్పు, నూనె, చక్కెర, కూరగాయలు కనీసం మూడు నెలల పాటు రేషన్ సరఫరా చేయాలని కోరారు. ఉపాధి హామీలో పని కోరిన వారందరికీ పని కల్పించి, జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమానుల అనుమతితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలకు గత ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఉపాధి పనులను వ్యవసాయ పనులతో అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కుత్తుం దుష్యంత్, కె.లోకనాథం, పి.అప్పారావు, వంకల అప్పయ్య, కె.ఈశ్వరమ్మ, సుందరమ్మ, జోగారావు, పాపయ్య జగదీష్, రామకృష్ణ, ముసలయ్య పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి- పొందూరు

అర్హతే ప్రామాణికంగా ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కేశవదాసుపురంలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు గాడు నారాయణరావు, సెక్రటరీ శ్రీరాములు పాల్గొన్నారు.

నరసన్నపేట : అర్హులందరికీ పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని దేవాదిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ధర్మాన అసిరినాయుడు, గొండు లక్ష్మణరావు, సూర్యారావు, గొరివిల్ల రఘునాథ్, దుంగ గంగారాజు, ధర్మాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పడ్డలో ఎన్‌టిఆర్ భరోసా పింఛనను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ హనుమంతరావు, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి, ఎంపిటిసి నంబాల వెంకటరావు, బుర్ల లలిత కుమారి, ఎస్.ఎల్లంనాయుడు, కదంబాల రాజు, రవ్వల గణపతి, బసవ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డులో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి కార్యదర్శి వజ్జ బాబూరావు పింఛన్లను పంపిణీ చేశారు.

పొందూరు : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కార్యక్రమంలో సాసుమాన చంద్రమౌళి, జగదీష్ పండా, దేవుడు పాల్గొన్నాడు. అలాగే లక్ష్మీపురం ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు పింఛన్లను పంపిణీ చేశారు.

జి.సిగడాం : మండలంలోని పెనసాం, బాతువ గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమరాపు రవికుమార్, వి.రఘురాం, బూరాడ వెంకటరమణ, సర్పంచ్ డబ్బాడ కళ్యాణి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

లావేరు : ఎంపికైన విద్యార్థులతో పిఇటి కుసుమకుమారి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన వివిధ పోటీల్లో పురుషోత్తపురం ఎపి ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ అండర్-19లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.తేజ్ చరణ్ సిద్ధు, అండర్-17లో 9వ తరగతి చదువుతున్న ఎన్.మనోజ్, అండర్ -14లో 9వ తరగతి చదువుతున్న బి.చేతన్, 8వ తరగతి చదువుతున్న పి.శ్యామ్, జె.సాయిహర్షలు ఉన్నారు. నెట్ బాల్ పోటీలకు అండర్-17లో 9వ తరగతి చదువుతున్న ఎస్.సూర్యచరణ్ ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు అండర్-14లో 8వ తరగతి చదువుతున్న కొణతాల చైతన్యరెడ్డి ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్-17లో బి.పావని, కె.సంధ్య, బి.పవిత్ర పదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అండర్-17లో 9వ తరగతి విద్యార్థిని పి.కీర్తిప్రసన్న ఎంపికైంది. వీరికి ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ బేసి సుధాకర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

లావేరు: మండలంలోని మురపాకలో ఉన్న కెజిబివి పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు త్రోబాల్ అండర్-19కి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారయ్యారని ప్రిన్సిపల్ బల్ల సుధారాణి మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో త్రోబాల్ మహిళ అండర్-19కి డి.శాంతి, జె.యమున పాల్గొని విజేతలుగా నిలిచారని అన్నారు. వీరికి పాఠశాల పిఈటి సూరపు కుసమకుమారి అభినందించారు.

ఇచ్ఛాపురం : అభినందిస్తున్న అధ్యాపకులు

ముందస్తు దసరా సంబరాలు

పొందూరు : ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

బూర్జ : సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపిపి కె.దీప అన్నారు. మండలంలోని లక్కుపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముందస్తు నిర్వహించిన దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ గేయాలని ఆలపించారు. ఎప్పుడో మర్చిపోయిన సంప్రదాయాన్ని ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వియ్యాపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో ముందుస్తు దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషాలు ధరించి పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, జగదీశ్వరి, అర్చన, సాంబమూర్తి, సూర్య, అనుదీప్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శాంతినికేతన్ హైస్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. శైలపుత్రి, బాలాత్రిపుర సుందరీ, గాయత్రీదేవి, లలితాదేవి, సరస్వతీదేవి, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మి, దుర్గాదేవి, మహిషాసురమర్దినీదేవి వేషధారణలు అందరినీ అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శంకర్, సునీత, తనుజ, శ్రీధర్ ఇంటరాక్ట్ ప్రెసిడెంట్ తెజేష్, సెక్రటరీ మోహన్, ప్రియా వైస్ ప్రెసిడెంట్ జి.హారిక, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్థన్ రెడ్డి, ఎస్.పి.జ్యోత్స్న పాల్గొన్నారు.

పొందూరు: అన్ని మతాల పండుగలు ఐక్యతా భావానికి నాంది పలుకుతాయని, లౌకిక భావనలకు దోహదం చేస్తాయని భాష్యం ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక భాష్యం పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలను అత్యంత వేడుకగా నిర్వహించారు. బాలికలు దుర్గాదేవి అవతార రూపాలను సంప్రదాయబద్ధంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన నృత్య, గీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఇచ్ఛాపురం : ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉత్తరాంధ్ర లాంటి వెనుకబడిన ప్రాంతం ప్రగతికి దోహదపడే ప్రాంతీయ మండళ్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని టిడిపి సీనియర్ నాయకుడు, విజయనగరం జిల్లా కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, విశ్రాంత తహసిల్దార్ పేడాడ జనార్ధనరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని శ్రీహరిపురం తన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా అభివృద్ధి జరగాలంటే ప్రాంతీయ మండళ్ల ఏర్పాటే శరణ్యమని అన్నారు. వైసిపి హయాంలో మూడు రాజధానుల పేరిట ఉత్తరాంధ్ర వినాశనానికి పూనుకున్నారే తప్ప అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారం మొదలుకొని ఎన్‌టిఆర్ సుజల స్రవంతి, సాగు, తాగునీటి ప్రాజెక్టులు ఇలా అన్నింటిలోనూ ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు ఉన్నారు.

25 మంది రక్తదానం

ప్రజాశక్తి- మందస

మండలంలోని హరిపురంలోని శ్రీకుమార్ కళాశాల, భైరవి ఐటిఐ కళాశాల అధ్యాపకులు ప్రశాంత్, ఈశ్వరరావు ఆధ్వర్యాన రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 25 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ రాపాక తిరుపతిరావు, మందస మండలం ఏరియా మేనేజర్ సాలిన శివ, శ్రీకుమార్ అధ్యాపకులు తాతారావు, సాలిన లోకేష్ పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

గాంధీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- లావేరు

జాతిపిత మహాత్మాగాంధీ మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కేశవరాయునిపాళెంలో స్థానిక కూటమి నాయకులు నూతనంగా నిర్మించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు గాంధీ, స్వామి వివేకానంద ప్రభోదాలను అనుసరించి దేశ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎన్‌టిఆర్ భరోసా పింఛనను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాజపంతుల ప్రకాశరావు, జల్లెపల్లి జనార్ధన్, లుకలాపు అప్పలనాయుడు, శాంతారెడ్డి, తిప్పన బాబూరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీలో మంగళవారం ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామ శివారున ఉన్న శ్మశాన వాటిక చుట్టూ సిసి రోడ్డును నిర్మించారు. ఈ పనులను సర్పంచ్ ప్రతినిధి మామయ్యరెడ్డి పర్యవేక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు.

పుస్తకాలను అందజేస్తున్న జోగారావు

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని సూరాడవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు నోట్ పుస్తకాలు, పెన్నులను సొంత నిదులతో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మూల రవికుమార్, ఉపాధ్యాయులు దుర్గారావు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కవిటి డయాలసిస్ కేంద్రంలో బెడ్ల కొరత

ఇచ్ఛాపురం: కవిటి మండల కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించిన సమయంలో రోగులకు సరిపడా బెడ్‌లు లేవని, ప్రభుత్వం స్పందించి బెడ్‌లను సరఫరా చేయాలని సీడాప్ ఎపి మాజీ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. కవిటిలోని డయాలసిస్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ రోజు19 బెడ్‌లపై సుమారు 54 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుతున్నాయని అన్నారు. అదనంగా సరిపడ డయాలసిస్ యంత్రాలు, రూమ్‌లు అందుబాటులో లేవన్నారు. డయాలసిస్ రోగులకు పింఛన్లు రావడం లేదని మొరపెట్టుకున్నారని తెలిపారు. ఈయన వెంట వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి చల్ల దేవరాజ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రెండు బెడ్లు అందజేత

లావేరు: లావేరు పిహెచ్‌సిలో బెడ్లు కొరత ఉండడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు తనవంతు సామాజిక బాధ్యతగా గుర్తించి రూ.25 వేలు విలువైన బెడ్లను మంగళవారం అందజేశారు. ఈయనకు ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, వైద్యులు మౌనిక అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంకలపల్లి ఆనంద్, నిదిగంట్ల త్రినాథ్, నూకల శంకరరావు, యినపకుర్తి రమణ, లంకలపల్లి రాంబాబు, అనిల్ కుమార్, దొర రాజారమేష్, ఇజ్జు శంకరరావు పాల్గొన్నారు.

కృష్ణచైతన్య పరామర్శ

పోలాకి : మండలంలోని బార్జిపాడులో వైసిపి నాయకులు గున్న సంజీవమ్మ అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ ఉమ , మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు రోణంకి రామారావు, మాజీ సర్పంచ్ కొప్పల వెంకటరావు, అప్పిని చిట్టిబాబు పాల్గొన్నారు.

జనసేన నాయకుల దీపారాధన

టెక్కలి రూరల్ : జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పలె పల్లెలో దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితికిరణ్ అన్నారు. మండలంలోని తెలినీలపురం ఆలయంలో మంగళవారం దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నందిగాం మండల అధ్యక్షుడు చిరంజీవి, జిల్లా కార్యదర్శి షణ్ముఖ, టెక్కలి నియోజకవర్గ నాయకులు గవరయ్య, కుమార్‌స్వామి, త్రివేణి, హరి, వెంకటరమణ, గద్దాయి భాస్కర్, విశ్వనాథం, గిరి, శాంతారావు, నరేష్, గోపి, రామకృష్ణ పాల్గొన్నారు.

సారవకోట : మండలంలోని చీడిపూడిలో వెంకటేశ్వర ఆలయం ఆలయంలో జనసేన నాయకులు శుద్ధి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి యోగహరి, వరుధు. రాజశేఖర్, బుడితి ఎంపిటిసి మెండ మురళి, తంగి చలపతి పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి రూరల్ : మండలంలోని వేములవాడకు వైసిపి నాయకులు పోలాకి చంద్రశేఖర్ పెంచుకుంటున్న మామిడి మొక్కలను నరికేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు అట్ల రాహుల్ పోలీసులను కోరారు. ఈ మేరకు నరికేసిన మామిడి మొక్కను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో పేడాడ రమేష్, హనుమంతు వెంకటేశ్వరరావు, గుజ్జు మోహన్ రెడ్డి, బి.కూర్మారావు, జయ మోహన్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

చెక్కును అందజేస్తున్న దాతలు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఉత్సవాలు సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న భారీ అన్నదానానికి శ్రీకాకుళానికి చెందిన వ్యాపారవేత్త అంధవరపు సంతోష్‌కుమార్, కోటబొమ్మాళికి చెందిన కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజారాపు అచ్చెన్నాయుడులకు మంగళవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు.

'సర్వేపల్లి' విగ్రహావిష్కరణ

మెళియాపుట్టి: మండలంలోని ముకుందపురంలో లింగాల సుజాతమ్మ జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాలలో సంజీవరావు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని నిర్మించారు. దీనిని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, తహశీల్దార్ హనుమంతురావు, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభవరావు, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి, నంబాల వెంకటరావు, మాలతి శ్రీధర్, హనుమంతు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : కవిటికి చెందిన పి.ఎన్.నాగభూషణం న్యుమోనియా, ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ బెంగుళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం ఇప్పటికే రూ.20 లక్షలు ఖర్చు చేశారు. చికిత్స కోసం మరో రూ.20 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. పేద కుటుంబం కావడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 చదువుకున్న పదో తరగతి విద్యార్థులు రూ.30 వేలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు వరప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జి.సిగడాం : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, అన్నారు. మండలంలోని బాతువలో సర్పంచ్ డబ్బాడ కళ్యాణి, కూనుబిల్లి కూర్మారావు ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామాలు, నివాస ప్రాంతాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమారాపు రవికుమార్, డబ్బాడ అదినారాయణ, కూనుబిల్లి శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, బి.అప్పలనాయుడు పదాల అప్పన్న, ఎంపిడిఒ నిశ్చల పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉల్లాసంగా..

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ అధ్యక్షతన మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. అనంతరం నాన్ టీచింగ్ సిబ్బంది నేపోలియన్, నాగరాజులకు స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోపాలదాసునాయుడులు సన్మానించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విశ్రాంతి ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్, అధ్యాఫకులు ఆపల్గొన్నారు.

పలాస: పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభాపురం వద్ద ఉన్న ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా జాతీయ సేవా పథకం కొత్త యూనిట్‌ను కళాశాల డైరెక్టర్ కె.వి.శాస్త్ర ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షలకు ప్రతి ఒక్క విద్యార్థీ చక్కటి ప్రణాళిక వేసుకొని ముందుకుసాగాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం గతేడాదిలో ఇంటర్, డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డి.నారాయణరావు, ఖగేష్, ఎఒ ఈశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సినీ గేయాలకు నృత్యం చేశారు. కార్యక్రమంలో తత్వవేత్త లమ్మత మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్ కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, ఎ.రామారావు, వాసుబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తెరుచుకున్న మద్యం దుకాణాలు

ప్రజాశక్తి- పొందూరు

తమకు స్పష్టమైన హామీ ఇస్తేకాని మద్యం దుకాణాలు తెరవమంటూ ఉదయం నుంచి భీష్మించుకుని ఉన్న సిబ్బందితో ఎక్సైజ్ అధికారులు జరిపిన చర్చలు ఫలించడంతో ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎట్టకేలకు మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. ఉదయం నుంచే మందు బాబులు దుకాణాలు వద్ద పడిగాపులు కాసినా తెరుచుకోకపోవడంతో మద్యం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మద్యం విక్రయం చేపట్టాలంటూ ఎక్సైజ్ అధికారులను కోరారు. పొందూరు మండలం పరిధిలో సుమారు ఆరు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. సెప్టెంబరు 30తో మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఒప్పందం గడువు ముగిసిపోవడంతో మంగళవారం మద్యం దుకాణాలను తెరవలేదు. దీంతో స్థానిక ఎక్సైజ్ సిఐ వై.రాజు, ఎస్ఐ రామకృష్ణ సంబంధిత సిబ్బందితో దుకాణాలు తెరవాలని కోరినా వినలేదు. దీంతో ఎక్సైజ్ ఉన్నతాధికారులు సంబంధిత మద్యం దుకాణాలు సిబ్బందితో మాట్లాడి పలు విషయాలపై హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు సాయంత్రం మద్యం దుకాణాలను తెరిచారు. సాయంత్రం మద్యం దుకాణాలు తెరవడంతో మందుబాబులు మద్యం కొనేందుకు ఎగబడ్డారు. బుధవారం గాంధీ జయంతి కావడంతో మద్యం దుకాణాలు తెరుచుకోవనే ఉద్దేశంతో అదనంగా మద్యం సీసాలను మందుబాబులు కొనుగోలు చేశారు.

దుకాణాల సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ రాజు

వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వాలంటీర్లకు నాలుగు నెలలుగా బకాయిపడిన వేతనాలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ ఈశ్వరమ్మను మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవేంటనే జీతం రూ.పది వేలుకు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో రాజీనామాలు చేసిన వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వాలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించి న్యాయం చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

యాజమాన్య పద్ధతులతో పంట దిగుబడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

యాజమాన్య పద్ధతులతో మేలైన పంట దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ ఎడి బి.రజని అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు తెగుళ్లను ఏవిధంగా ఎదుర్కోవాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఎఒ మెట్ట మోహనరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చిట్టిబాబు, బి.స్వాతి, ఎఒడిఆర్‌సి వై.సూర్యకుమారి, డి.భానుప్రియ, ఉద్యానవనశాఖ అధికారి బి.జయంతి, ఎఫ్‌పిఒ స్వీప్ డైరెక్టర్ కె.రమణమూర్తి, అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ పి.శారద, సర్పంచ్ సోమరాజు తేజేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి వండాన ఉదయ్‌కుమార్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ వి.లావణ్య పాల్గొన్నారు.

నందిగాం : రైతులు వరి పైరులో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని కాపుతెంబూరులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలతో పాటు విధిగా వరి పైరుకు మొదటి సారీ ఎరువును వేసేటప్పుడు, చివరి దఫా ఎరువు వేసేటప్పుడు పటాస్ ఎరువును వాడితే గింజ నాణ్యతతో పాటు బరువు పెరిగి చీడపీడల నుంచి రక్షణ కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కొల్లి హరిబాబు, పి.శ్రీరాములు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వాణి పాల్గొన్నారు.

పలాస : ఖరీఫ్‌లో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎల్.వి.మధు అన్నారు. మండలంలోని మోదుగులపుట్టి, చినబడాం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలకు చీడ పురుగులు, వ్యాధులు సోకే సమయంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉంగ ప్రవీణ, వ్యవసాయ శాఖ ఎఒ పోలారావు పాల్గొన్నారు.

పలాస : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న వరి పంటకు సంబంధించి నష్టాల అంచనాపై అవగాహన కలిగి ఉండాలని పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ ఎల్.వి.మధు వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం విఆర్ఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ గణాంకాల అధికారిణి బి.వి.కె.లక్ష్మి, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు, మండల ఎఒ పోలారావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని యూనిట్ అల్తిలో స్టేట్ టీమ్ దేవుళ్ళు , అడిసినల్ డి.పి.ఎం.ధనుంజయరావు ఆధ్వర్యాన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటిడిసెన్ఎంపి ముసలయ్య,

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న రజని

ఎం.టి.సూర్యనారాయణ, వెలుగు ఎన్‌జిఒ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, కామేశ్వరరావు, జగన్, వెంకటరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని బూర్జపాడు, ధర్మపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇఒ భార్గవి పంట సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో

పొందూరు: రైతులు వరిసాగులో మెళకువలను నేర్చుకోవడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చునని మండల ఎఒ బెండి బాబ్జీ అన్నారు. మండలంలోని అచ్చిపోలవలస, కింతలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెళియాపుట్టి : మండలంలోని వెంకటాపురం, మర్రిపాడు-సి గ్రామంల్లో ఎఒ దాణకర్ణుడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దినకరరావు, బాలరాజు, వెంకటరావు, నరేంద్ర, త్రినాథ్ పాల్గొన్నారు.